క్లుప్తంగా

యువతను చైతన్య పరిచిన సామాజిక ప్రవక్త

చిక్కడపల్లి: స్వామి అనగానే సాధువో, సన్యాసి అనో అనుకుంటారని కానీ వివేకానంద సమాజాన్ని ప్రధానంగా యువతను చైతన్యపరచి ప్రజలకు సేవచేసే దిశగా స్ఫూర్తి నింపిన సామాజిక ప్రవక్త అని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం సాయంత్రం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ జన్మదిన సప్తాహంలో బండిరాజుల శంకర్ బృందం స్వామి వివేకానంద బుర్ర కథను చెప్పారు. ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొలేటి దామోదర్ పాల్గొని శంకర్ రచించిన స్వామి వివేకానంద సూక్తి శతను ఆవిష్కరించారు. దామోదర్, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి



స్వచ్ఛ ర్యాలీలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: స్వచ్ఛభారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, కార్మికులతో కలిసి డివిజన్‌లోని శ్రీనివాసనగర్‌లో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతోందన్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆంజనేయులు, ఆదిల్, హరినాథ్, బీజేపీ నాయకులు చుక్క జగన్, మిర్యాల శ్రీను పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో బీజేపీ కార్నర్ సమావేశం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ గుండు క్రాస్‌రోడ్స్ బీజేపీ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కౌండిన్య ప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు నరేష్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, భరత్‌గౌడ్, రాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేశామన్నారు. బీజేపీ నాయకులు కిషోర్, శేషసాయి, మాధవి, నాగరాజు, వంశీకృష్ణ, గౌరీశంకర్ పాల్గొన్నారు.

జనగణనలో బీసీ కులగణన చేపట్టాలి

కాచిగూడ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, విపక్ష కాంగ్రెస్ పార్టీలు జనగణనలో బీసీ కులగణన చేపట్టడానికి వెనుకడుగు వేస్తున్నాయని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ విమర్శించారు. దేశంలో 70 కోట్ల మంది బీసీలపై ఆయా పార్టీలకు ఉన్న వివక్షతే దీనికి కారణమన్నారు. మంగళవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయరంగాల్లో రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని అన్నారు. మెట్టు ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్కర్, భూషణ్ భాస్కర్, ధరణీధర్‌యాదవ్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్ తదితరులున్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

ముషీరాబాద్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు సోమన్ ఆధ్వర్యంలో ప్రభుత్వవిప్‌గా నియమితులైన కౌశిక్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తున్నాయన్నారు. ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, రాజు, సదా, సంతోష్, అజయ్‌ముదిరాజ్, గోవింద్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

పేదలకు కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలి

కాచిగూడ: అర్హులైన పేదలందరికీ కొత్తరేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. ఇప్పటి వరకు రద్దు చేసిన రేషన్ కార్డుల్లో అధికశాతం ప్రజలు పేదవారే ఉన్నారని వారిని గుర్తించి తిరిగి రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. నాంపల్లి సర్కిల్ 4 అసిస్టెంట్ సివిల్ సప్లై కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ ఆధ్వర్యంలో విజిలెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతినెల 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు ప్రజలకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి రమేష్, అసిస్టెంట్ సివిల్ సప్లై అఫీసర్ తుక్యానాయక్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాల పట్ల బలమైన ఉద్యమం

మూతపడిన పరిశ్రమలను పునః ప్రారంభించాలి

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ డిమాండ్


ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో అభివాదం చేస్తున్న బీఎంఎస్ నేతలు


కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని వీటికి వ్యతిరకంగా బలమైన కార్మిక ఉద్యమం నిర్వహిస్తున్నట్లు భారతీయ మజ్దూర్‌సంఘ్ (బీఎంఎస్) జాతీయ నాయకుడు కె.లక్ష్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేశంలు తెలిపారు.

- రాష్ట్రంలో మూతపడ్డిన పరిశ్రమలను తక్షణమే పునః ప్రారంభించి సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా మంగళవారం ఇందిరా పార్కు వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.
- ఈ ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచడానికి సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.
- సీఎం కేసీఆర్‌కు కార్మికుల పట్ల చిత్త శుద్ధి లేదని కనీస వేతనాల నోటిఫికేషన్‌లు గత 8 ఏళ్లుగా సీఎం టేబుల్‌పైనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు.
- సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం బుట్టదాఖలు అయ్యిందన్నారు.
- నిజాం దక్కన్ షుగర్, అమలాపురం బిల్ట్ కంపెనీలు మూసివేయడం వల్ల దాదాపు 50 వేల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- రాష్ట్రంలో ఉద్యోగ భద్రత కరువైందని దాదాపు 5 వేల చిన్న పెద్ద పరిశ్రమలు మూతపడ్డాయన్నారు.
- ఆర్టీసీ కార్మికులను రోడ్డు పాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఉద్యమాలు చేపడితే కార్మిక సంఘాలను రద్దు చేయడమంటే ప్రజా స్వామ్యాన్ని కూనీ చేయడమేనని ధ్వజమెత్తారు.
- బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.
- రాష్ట్రంలో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా నిధుల కేటాయింపు జరగడంలేదన్నార.
- బోర్డుకు కేటాయించిన రూ.1054 కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.
- బీఎంఎస్ దక్షిణ క్షేత్ర సంఘటనా కార్యదర్శి దురైరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, చెన్నకేశవరావు, రవిశంకర్, టీపీటీటీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్, భూలోకేశ్వరి, మంజుల, కార్యదర్శులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, రమేష్, విష్ణువందన, శంకర్, పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, గ్రేటర్ నాయకులు దురాచారి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి


డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ కాశీరాంజీరా ప్రాంతంలో రూ.25 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు మేలు చేస్తోందన్నారు.

- ప్రజల విజ్ఞప్తి మేరకు వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తామని వరదనీరు బస్తీవాసుల ఇళ్లలోకి రాకుండా శాశ్వత పరిష్కారంగా ప్రత్యేక వరద నీటి పైపులైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.
- డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్పిస్తానని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.
- డ్రైనేజ్ పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే దానిపై రోడ్డు వేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను చేయిస్తున్నందుకు స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ రాంబాబు, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, శిరీష, ఓంప్రకాష్‌యాదవ్, సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణగౌడ్, సునీల్ బిడ్లాన్, మహేష్, రాజేష్, నర్సింగ్‌బాబు, బబ్లూసింగ్, బీజేపీ నేతలు బండారు సంతోష్‌కుమార్, సుభాష్‌పటేల్, ఎస్.రవియాదవ్, బల్వీర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణ పనుల పరిశీలన

అంబర్‌పేట: నియోజకవర్గంలో పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ సోమసుందర్‌నగర్‌లో రూ.55 లక్షలతో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో పార్కుల అభివృద్ధికి హెచ్‌ఎండీఏ నుంచి ప్రత్యేక నిధులను మంజూరు చేయించామన్నారు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, ఆహ్లాదంకోసం ప్రత్యేక మొక్కలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. హార్టికల్చర్ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు దిలీప్ రాజ్, మిర్యాల రవీందర్, రమేష్‌నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత సీఎం దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



సాక్షి,సిటీబ్యూరో: దివంగత ముఖ్యమంతి దామోదరం సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా జాతీయ షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు రాజు వస్తాద్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన స్వాతంత్య్ర సమరయోధుడు దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నిరుపేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి ప్రజలకు ఉత్తమ సేవలందించారన్నారు. ప్రజల మనస్సుల్లో ఆయన సుస్థిర స్థానం సాధించారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రాయకంటి నర్సింగరావు, జాతీయ సెక్రటరీ జనరల్ బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు హరికష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాగేష్ ముదిరాజ్

ముషీరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య 102వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిక్కడపల్లి: నీతికి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సంజీవయ్య నిలిచారని అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు రామన్న అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ తొలి ముఖ్యమంత్రి సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ.. సంజీవయ్యలాగా నిజాయితీగా నిలవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాలకు కావాల్సిన విద్య, వైద్యం కనీస వసతులు కేవలం రాజ్యాధికారంతోనే సాధించుకోవచ్చన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివన్న, సంపత్‌కుమార్, సత్య, దినేష్, పండు, లక్కీ, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మహేష్‌బాబు, నారాయణ, చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

‘బీసీలను విస్మరిస్తున్న కేంద్రానికి గుణపాఠం తప్పదు’


మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: బీసీలను విస్మరిస్తున్న బీజేపీ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు అన్యాయం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు ఎలాంటి లాభం లేదన్నారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు కేంద్రం కనీసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు.

- సుప్రీంకోర్టు, మండల్ కమిషన్ చెప్పినా కులగణన చేయకుండా కాలయాపన చేస్తోందని కేంద్ర ప్రభుత్వం మెజారిటీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకుండా పాలన సాగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.
- ఓబీసీ ‘నాన్ క్రిమిలేయర్’ ఆదాయ పరిమితిని పెంచకపోవడం అన్యాయమని రూ. 45 లక్షల వేల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు మాత్రమే బీసీలకు కేటాయించడం అన్యాయమన్నారు.
- జాతీయ బీసీ కమిషన్‌కు వైస్‌చైర్మన్, సభ్యులను నియమించకపోవడం వెనుక కారణం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చే విషయం ముందుకెళ్లడం లేదన్నారు.
- బీసీ కులాల జనాభా లెక్కలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఉన్నత న్యాయస్థానం బీసీల లెక్కలు తేల్చాలని ఆదేశించినా పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీసీ దళ్ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుందర్, పద్మ, శరణ్, రమణ, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కవాడిగూడ: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యూటీని చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మీ పథకాలను రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 శాతం పీఆర్‌సీని వర్తింపచేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నేటికి ఆచరణకు నోచుకోలేదని ఆరోపించారు. అంగన్‌వాడీ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పద్మ, ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, కోశాధికారి సునీత, కవిత, పద్మ, వెంకమ్మ, నర్సమ్మ, స్వర్ణ, కోటేశ్వరి, స్వప్న, సునీత తదితరులున్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు అభినందనలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బండా ప్రకాష్‌ను బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మంగళవారం కలిసి పుష్ప గుచ్చం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల నాయకులు ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్‌కేవీ ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులున్నారు.

అభినందన


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో డీఎంసీ యాదయ్య

ముషీరాబాద్: జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన తిప్పర్తి డాక్టర్ యాదయ్య మంగళవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్యకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ప్రముఖ సంఘ సేవకుడు శ్రీహరి ఆకస్మిక మృతి



కాచిగూడ: వాసవీ బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ (వీబీజీ) ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆపదలో ఉన్న వారికి భరోసా కల్పించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.శ్రీహరి ఆకస్మికంగా మృతి చెందారు. చార్టెడ్ అకౌంటెంట్‌గా ఆయన అందరికీ సుపరిచితులు. కరోనా కాలంలో వేలాది మంది ఆకలి తీర్చి వందలాది మందికి ఉచితంగా మందులు అందజేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అంతిమయాత్ర బుధవారం ఉదయం కవాడిగూడ, ఎస్‌బీహెచ్ కాలనీ నుంచి ప్రారంభమై బన్సిలాల్‌పేట హిందూ స్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని వీబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మడిపడిగ రాజు ప్రకటించారు.

వినతిపత్రం అందజేత

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ సర్కిళ్ల పరిధిలో రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేస్తున్న వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు గౌరవ వేతనం రూ.18వేలు ఇవ్వాలని చైతన్య రిసోర్స్‌పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (యూసీడీ అండ్ ఎలక్ట్రికల్) శృతి ఓఝూ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 5 ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో రిసోర్స్ పర్సన్స్‌గా విధులు నిర్వహిస్తున్నామని తమకు కేటాయించిన ప్రతి పనిని సమర్థవంతంగా పూర్తిచేస్తూ.. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటున్నామని అసోసియేషన్ అధ్యక్షురాలు నాగరాణి, దశరథలక్ష్మీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ముందుండి విధులు నిర్వహిస్తూ.. అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. నాగతులసి, హేమలత, సుష్మ, కరుణ, నవనీత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


బీజేపీలోకి మహిళా నేతలను ఆహ్వానిస్తున్న ఎన్.గౌతంరావు

కాచిగూడ: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లకుంట డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు భాగ్య, శోభ, అశ్విని, స్వప్న, జ్యోతి తదితరులు కార్పొరేటర్ అమృత సమక్షంలో బీజేపీలో చేరారు. మహిళలకు డాక్టర్ ఎస్.గౌతంరావు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. సమాజం ఆర్థికంగా, విజ్ఞాన పరంగా అభివృద్ధి చెందాలంటే మహిళాశక్తి ఎంతో అవసరమన్నారు. పార్టీ నేతలు శ్యామ్‌రాజ్, జ్యోతి, శిరీష, ప్రవీణ్, ఎంబీ కిషోర్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను ప్రేమించండి


గోవులను ఆలింగనం చేసుకుంటున్న గో సేవ ఫౌండేషన్ సభ్యులు

కవాడిగూడ: ‘ప్రేమికుల రోజు వద్దు..గో ప్రేమికుల రోజే ముద్దు’ అంటూ అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోశాల వద్ద ‘కౌ హగ్ డే’ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ గాంధీనగర్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గో ప్రేమికులు పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు నిర్వాహకులు గోశాలలోనే కార్యక్రమం నిర్వహించారు. గోశాలలో ఉన్న గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలింగనం చేసుకొని కౌ హగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఎ.బాలకృష్ణ గురుస్వామి, ఫౌండేషన్ ప్రతినిధులు చంద్రస్వామి, లోకేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మురళీకృష్ణ, మల్లేష్, కవిత, రవి, రాఘవేందర్ పాల్గొన్నారు.

మెట్రో రెసిడెన్సీ దశాబ్ది ఉత్సవాలు


ఆర్.పి.పట్నాయక్, చాడ వెంకట్‌రెడ్డిలతో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

ముషీరాబాద్: ఉమ్మడి కుటంబ వ్యవస్థ మనుగడ కష్టమైన ఈ రోజుల్లో ఓ అపార్ట్‌మెంట్‌లోని 65 కుటుంబాలు ఉమ్మడిగా కలిసిమెలిసి నివసించడం హర్షనీయమని ప్రముఖ సంగీత దర్శకులు, రచయిత ఆర్‌పీ పట్నాయక్ కొనియాడారు. రాంనగర్‌లోని మెట్రో రెసిడెన్సీ నిర్మాణం జరిగి 10 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు డ్రాయింగ్, క్రియేటివ్ రైటింగ్, వ్యాసరచన, క్విజ్, సింగింగ్, డ్యాన్సింగ్, ఫ్యాన్సీడ్రెస్, రన్నింగ్, స్లో– సైక్లింగ్, మ్యూజికల్ చైర్, రంగోళి తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, బిల్డర్ సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు రాజమహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి కిశోర్‌కుమార్, సభ్యులు కె.ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, బాల్‌రెడ్డి, శ్రీవల్లి, సునీత, ప్రఫుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కు మూసివేత


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కవాడిగూడ: రోజూ సందర్శకులు, ప్రేమజంటలతో కళకళలాడే నగరంలో ప్రసిద్ధిగాంచిన ఇందిరా పార్కు బోసిపోయింది. ప్రేమికుల రోజు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గాంధీనగర్ పోలీసులు ముందస్తు జాగ్రత్తగా మంగళవారం పార్కును పూర్తిగా మూసివేయించారు. సందర్శకులను అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగిపోయారు. ప్రతిరోజూ వందలాది ప్రేమ జంటలు ఇందిరాపార్కుకు వచ్చి సేద తీరేవారు. కాగా ప్రేమికుల రోజున ఇందిరాపార్కు మూసివేయడంతో తీవ్ర నిరాశతో అనేక ప్రేమజంటలు వెనుదిరిగారు.

- ప్రేమికుల దినోత్సవాన్ని బహిష్కరించాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, శివసేన తదితర సంస్థలు పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు బందోబస్తు చేపట్టారు. గాంధీనగర్ సీఐ మోహన్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యంగా ఉన్నా.. తప్పనిసరి పరిస్థితిలోనే ఇందిరాపార్కును మూసివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

బండరాయితో మోది వ్యక్తి దారుణ హత్య

చిక్కడపల్లి: బండరాయితో మోది ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి వివేక్‌నగర్ హనుమాన్ దేవాలయం వద్ద ఫుట్‌పాత్‌పై నివసించే శ్రీను(30) పొట్టకూటికోసం యాచకుడిగా మారాడు. మంగళవారం తెల్లవారుజామున అతడు నిద్రిస్తున్న సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బండ రాయితో కొట్టగా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం 6 గంటల సమయంలో ఆలయానికి వచ్చిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.